ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పశ్చిమ గోదావరి

జిల్లా వార్తలు

3

బుధవారం 24 జనవరి 2024

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 17.0

సార్వత్రిక ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ అటు రాజకీయ పక్షాల్లోను, ఇటు అధికార యంత్రాంగంలోను మార్పులు, చేర్పులతో భారీ హడావుడి. ప్రత్యేకించి ఎన్నికల నిర్వహణకు వీలుగా అధికార యంత్రాంగాన్ని ఎన్నికల కమిషన్ అప్రమత్తం చేసింది. ఇప్పటికే ఓటర్ల జాబితా కూడా వెలువడింది. ఇక తదుపరి చర్యల్లో భాగంగా ఎన్నికల విధులతో సంబంధం ఉన్న అధికారులు ఎవరైతే ఉన్నారో ఒకేచోట మూడేళ్ళు పనిచేస్తే అటువంటి వారినందరినీ తక్షణం వేరే ప్రాంతానికి బదిలీ చేయాలని ఆదేశాలు. ఇప్పటికే పోలీసు శాఖలో బదిలీల ప్రక్రియ దాదాపు పూర్తయింది. కీలక విభాగాలైన కొన్నింటిలో మాత్రం ఈనెల 25లోపే ఈ తతంగాన్ని పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే ఎవరెవరు, ఎక్కడెక్కడ అనే దానిపై జిల్లా యంత్రాంగం ఒక స్పష్టతతో ఉన్నందున నేడో, రేపో కీలక ఉత్తర్వులు వెలువడతాయి. ఒక విశేషం ఏమిటంటే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రామాణికంగానే బదిలీలు ఉంటాయి.

- (ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

నేడో రేపో బదిలీలు



ఉమ్మడి పశ్చిమ జిల్లానే ప్రాతిపదికగా ట్రాన్స్‌ఫర్లు

- ఆ దిశగానే ప్రత్యేక కసరత్తు
- డజన్ల సంఖ్యలోనే బదిలీలు
- పోలీసుశాఖలో ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తి
- ఎన్నికల ఏర్పాట్లు వేగవంతం



త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఒకే ప్రాంతంలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని ఎన్నికల విధులతో సంబంధం ఉండే అధికారుల బదిలీ తప్పనిసరి. సాధ్యమైనంత మేర ఈ రెండు, మూడు రోజుల్లోనే ఈ బదిలీ ప్రక్రియ పూర్తి చేయాల్సిందిగా ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఇప్పటికే పోలీసుశాఖలో ఈ తాజా నిబంధనలకు అనుగుణంగానే గడిచిన పక్షం రోజులుగా బదిలీ ప్రక్రియ కొనసాగించారు. రేంజ్ పరిధిలో ఉన్న వారందరినీ గమనించి ఆ మేరకు ఎస్‌ఐల దగ్గర నుంచి సీఐల వరకు స్థానచలనం చేశారు. ఇప్పటికే వీరంతా తమకు కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరారు. ప్రత్యేకించి పోలీసు విభాగంలో ఎన్నికల వేళ ప్రతీసారి ముందస్తుగానే బదిలీలు ఉంటాయి. అందుకనే ఇప్పటికే టికెట్ ఖాయమైన కొందరు అధికార పక్ష సిట్టింగులైతే సాధ్యమైనంత మేర తమకు అనుకూలురు నియోజకవర్గంలో పోస్టింగ్ వచ్చేలా జాగ్రత్తపడే అవకాశాలున్నాయి. దీనిని అవకాశంగా తీసుకుని ఒత్తిడి చేసి ఒకవేళ పోస్టింగ్ తీసుకున్నా వారిపై ఎలాంటి ఆరోపణలు వచ్చినా తక్షణం ఎన్నికల కమిషన్ రియాక్షన్ ఉంటుంది. అయినప్పటికీ ఎంత వీలైతే అంత తమకు అనుకూలురు వచ్చేలా పావులు కదుపుతూనే ఉన్నారు. ప్రత్యేకించి ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన మాత్రమే బదిలీలు జరుగుతాయి కాబట్టి.. తాజాగా కొత్త జిల్లాలకు ఈ మధ్యనే బదిలీ అయినా అటువంటి వారికి కూడా ఒకే ప్రాంతంలో మూడేళ్ల విధుల షరతు వర్తిస్తుంది. ప్రత్యేకించి ఈ లెక్కన ఎంపీడీవోలు, తహసీల్దార్లు, జిల్లాస్థాయి అధికారులు డజన్ల సంఖ్యలో బదిలీ కావడానికి ఆస్కారం. ఉమ్మడి పశ్చిమలో దాదాపు సగానికి సగం మంది తహసీల్దార్లపైన బదిలీ ప్రభావం పడుతుంది. ఎందుకనంటే అత్యధికంగా మూడేళ్ళపాటు ఉమ్మడి జిల్లాలో పనిచేసినవారే ఎక్కువ. ఈ తరుణంలో వీరందరినీ స్థానచలనం చేస్తారు. ఎంపీడీవోల్లో కొంతమందిని ఈ మధ్యన బదిలీ చేశారు. కొందరికేమో ప్రమోషన్ ఆధారంగా బదిలీలు అయ్యాయి. ఎన్నికల విధుల్లో వీరిలో చాలామంది కొనసాగే అవకాశం ఉన్నందున బదిలీ కాబడే జాబితాలో ఎంపీడీవోల సంఖ్య అత్యధికంగానే ఉండే అవకాశాలున్నాయి. ప్రత్యేకించి కిందిస్థాయి సిబ్బంది బదిలీలేవీ పెద్దగా ఉండకపోవచ్చు.

ఎన్నికల ఏర్పాట్లు చకచకా..

రాబోయే ఎన్నికల నిర్వహణకు వీలుగా ఇప్పటికే పెద్దఎత్తున చర్యలకు దిగుతున్నారు. ఎక్కడికక్కడ ఓటర్ల తుది జాబితాను ప్రకటించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే పరిశీలించడానికి వీలుగా ప్రత్యేక ఎలక్షన్ సెల్ ఏర్పాటైంది. తమ అభ్యంతరాలు, ఫిర్యాదులను ఈ సెల్‌కు నివేదించాల్సి ఉంది. మరోవైపు పోలింగ్ కేంద్రాల నిర్ధారణ దాదాపు పూర్తయింది. ఇప్పుడేమో ఆయా కేంద్రాల్లో ఉన్న సౌకర్యాల మేర పూర్తిగా దృష్టిపెట్టారు. విద్యుత్ సరఫరా, తక్షణం ఉన్న సౌకర్యాలు, సమకూర్చాల్సిన సౌకర్యాలు, తాగునీరు, దివ్యాంగులను నేరుగా పోలింగ్ కేంద్రాలకు రావడానికి అనువుగా ర్యాంపుల నిర్మాణం వంటి చర్యలన్నింటిపైనా రాష్ట్ర ఎన్నికల కమిషన్ తాజాగా సమీక్షించింది. ప్రత్యేకించి ఎక్కడా లోపాలు తలెత్తకుండా ముందస్తుగానే జాగ్రత్తపడుతున్నారు. త్వరలోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణకు వీలుగా తీసుకుంటున్న చర్యలపై ఉన్నతస్థాయి సమీక్ష జరగనుంది.

జిల్లాస్థాయి అధికారులకు స్థానచలనమే..

జిల్లాస్థాయిలో ఇప్పటికే విధులు నిర్వహిస్తున్న కొందరు అధికారులు బదిలీ అయ్యే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. జిల్లాలో చాలాకాలం నుంచి విధులు నిర్వహిస్తున్న వారంతా సీనియర్లు కావడం, వీరందరిని ఎన్నికల విధుల్లోకి తీసుకోవాల్సి ఉన్నందున ఇక బదిలీ తప్పకపోవచ్చు అంటున్నారు. ఈ లెక్కన డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్, హౌసింగ్, సివిల్ సప్లయి, డీఈవో, జిల్లా మైనార్టీ, ఎస్సీ కార్పొరేషన్ అధికారులను బదిలీ చేసే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, సెట్‌వెల్, మెప్మా సంబంధిత శాఖాధిపతులు బదిలీ జాబితాలో చేరే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో, పశ్చిమగోదావరి జిల్లాలో ఈ శాఖల్లో విభాగాధిపతులుగా పనిచేస్తున్న కొందరు ఇప్పటికే మూడేళ్లకుపైగా సర్వీసు పూర్తి చేసుకున్నారు. ఎన్నికల నిబంధన ప్రకారం వీరందరినీ ఆయా ప్రాంతాల నుంచి విధిగా బదిలీ అవుతారు. ప్రత్యేకించి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా పనిచేయబోయే వారందరినీ ఇప్పటికే దాదాపు గుర్తించారు. ఇకపోతే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కలెక్టర్లు ఇంకొంత కాలం ఇదేస్థానాల్లో కొనసాగే అవకాశాలున్నాయి. ప్రస్తుత ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఉమ్మడి పశ్చిమ గోదావరి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఉన్నారు.



భారత ఎన్నికల కమిషన్ కాన్ఫరెన్సులో కలెక్టర్ ,ఎస్పీ

పటిష్ట ఎన్నికల నిర్వహణకు అధికారులు కృషి చేయాలి

భీమవరం, జనవరి 23 : రానున్న సార్వత్రిక ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని భారత ఎన్నికల కమిషన్ డైరెక్టర్లు సతీష్ పతారియా, పంకజ్‌లు సూచించారు. కర్ణాటక నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక శిక్షణ నిర్వహించింది. భీమవరం నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ రవిప్రకాష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. సతీష్ పతారియా మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థ (ఎలక్షన్ సీజర్ మేనేజిమెంట్ సిస్టమ్)ను రూపొందించిందన్నారు. గత డిసెంబర్‌లో చత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్, మిజోరాం, రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాలలో జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ ఈ వ్యవస్థను తొలిసారి ప్రయోగించగా మంచి ఫలితాలు వచ్చా యన్నారు. ఆ అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లోనూ ఈ విధానాన్ని అమలు పరిచేందుకు ఎన్నికల సంఘం సిద్ధమైందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు వెళ్లే రాష్ట్రాలకు సీనియర్ డీఈసీలు నేతృత్వంలోని బృందాల పర్యవేక్షణ ప్రక్రియ ప్రారంభమైందని, ఇందులో పాల్గొనే కింది స్థాయి యంత్రాంగాలకు వ్యయ పర్యవేక్షణ గురించి అవగాహన కల్పించే లక్ష్యంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు కృషి చేస్తున్నాయన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి, ఈఆర్‌వోలు, ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలి : కలెక్టర్

వీరవాసరం, జనవరి 23: పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం వీరవాసరం మండలంలోని చింతలకోటిగరువు, నడపనవారిపాలెం, తోలేరు, పడమటిపాలెం గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. నడపనవారిపాలెం, పడమటిపాలెంలో ఉన్న పాఠశాల భవనాలలో పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. తుది ఓటర్ల జాబితా ఆధారంగా ప్రతీ మండలంలో సంబంధిత తహసీల్దార్లు పరిశీలన చేసుకోవాలన్నారు. ఆర్డీవో కె.శ్రీనివాసులరాజు, తహసీల్దార్ సుందరరాజు, ఎంపీడీవో జ్యోతి పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బండారు

సీఎం,ఎమ్మెల్యే నరసాపురం ప్రజల్ని మోసం చేశారు

ఆర్డీవోకు మాజీ ఎమ్మెల్యే బండారు ఫిర్యాదు

నరసాపురం, జనవరి 23: ముఖ్యమంత్రి జగన్, నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు నరసాపురం ప్రజల్ని మోసం చేశారంటూ మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు మంగళవారం ఆర్డీవో అంబరీష్‌కు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.3200 కోట్లు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి 14 నెలలు గడిచింది. నేటికి శిలాఫలకాలే మిగిలాయన్నారు.ప్రజల ఓట్లతో గెలిచి వారినే ఎమ్మెల్యే మోసం చేశారని ఆరోపించారు. మెడికల్ కాలేజీ అంటూ హడావుడి చేసి ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకున్నారు. వచ్చిన కాలేజీని మరో నియోజకవర్గానికి తరలించారు. జిల్లా కేంద్రం వస్తుందంటూ ప్రజల్ని నమ్మించారు. చీఫ్ విప్ పదవి తీసుకుని జిల్లా కేంద్రం భీమవరం తరలివెళ్లుతున్నా నోరు మెదపలేదు. దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో హడావుడిగా ముఖ్యమంత్రి జగన్‌ను తీసుకొచ్చి 2022లో రూ.3200 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయించారన్నారు. హార్బర్, వశిష్టా వారధి, ఆక్వా యూనివర్సిటీ, వాటర్ గ్రిడ్, సబ్‌స్టేషన్, వియర్ ఛానల్, రెగ్యులేటర్లు వంటి పనులు వాటిలో ఉన్నాయన్నారు. మూడు నెలల్లో ఈ పనుల్ని ప్రారంభిస్తామని ప్రజల్ని నమ్మించిన ముదునూరి 14 నెలలు గడుస్తున్నా వాటి గురించి పట్టించు కోవడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటు అడిగే అర్హత ముదునూరికి లేదన్నారు.చిటికెల రామ్మోహన్, అంద్రాజు రామన్న, దానియేలు, సత్యనారాయణరాజు, కృష్ణ, ప్రభుదాసు, నారాయణ, పండు, హేమలత, రెడ్డెం శ్రీను పాల్గొన్నారు.

నరసాపురం ఇన్‌చార్జి తమ్మయ్య?



త్వరలోనే అధికార ఉత్తర్వులు
ఇప్పటికే ముఖం చాటేసిన అనేక మంది..
బీసీ మంత్రం ప్రయోగించేందుకు వ్యూహం

ఏలూరు ఆంధ్రజ్యోతి ప్రతినిధి/ఆచంట, జనవరి 23: ఎంపీ స్థానాల్లో పోటీ చేసేందుకు అనువైన, అనుకూలమైన అభ్యర్థుల కోసం వైసీపీ వెంపర్లాడుతోంది. ప్రత్యేకించి రాజకీయంగా హంగు, ఆర్థికంగా స్తోమత కలిగిన అభ్యర్థుల కోసం వెతుకులాడుతోంది. ఎవరూ దొరకని పక్షంలో ఏదొక కోణంలో ఒక అభ్యర్థిని రంగంలోకి దింపి సామాజికంగా మేమే ఆదరిస్తున్నామనే కలరింగ్ ఇస్తున్నది. ఈ నేపథ్యంలోనే నరసాపురం ఎంపీ స్థానానికి ఇన్‌చార్జిగా మాజీ జడ్పీటీసీ గుబ్బల తమ్మయ్యను నియమించాలని నిర్ణయానికి వచ్చారు. ఒక వైపు బీసీ మంత్రం పటించినట్లు అవుతుందని ఇంకో వైపు అభ్యర్థులు దొరకడం లేదనే వాతావరణానికి బ్రేక్ వేసినట్లు అవుతుందని జగన్ పార్టీ ద్విముఖ వ్యూహం. ఉమ్మడి పశ్చిమలో సాధ్యమైనంత మేర ఎంపీ స్థానాలకు తొలుత పార్టీలో ఆర్థిక బలం ఉన్న వారికి చోటు ఇవ్వాలని వైసీపీ భావించింది. ఏలూరు లోక్‌సభ స్థానంలో బలమైనవారి కోసం నెలలు తరబడి ముప్పు తిప్పలు పడింది. ఈ స్థానంలో సిట్టింగ్ ఎంపీగా ఉన్న కోటగిరి శ్రీధర్ తాను పోటీ చేయబోనని ఆరు నెలలు క్రితమే ప్రకటించడంతో ఆర్థికంగా,సామాజికంగా బలమైన అభ్యర్థి కోసం అన్వేషణ జరిపింది. మాజీ మంత్రులను సంప్రదించింది. సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి కారుమూరి నాగేశ్వరరావును పోటీకి దిగాలంటూ తిత్తిడి చేసింది. "నన్ను వదిలేయండి.. మా ఆ అబ్బాయికి అకాశం ఇవ్వాండని కారుమూరి చేసిన విజ్ఞప్తితో ఓ మెట్టు దిగి మంత్రి కోరికను నెరవేర్చారు. బీసీలు అంటే తమ పార్టీకి ప్రాణం అన్నట్లుగా అందుకే ఏలూరు లోక్‌సభ ఇన్‌చార్జిగా బీసీ వర్గాలకు చెందిన సునీల్ కుమార్‌ను నియమించి నట్టుగా కలరింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటివరకు శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న తమ్మయ్యను నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియ మించబోతున్నారు. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పేరు కూడా చాన్నాళ్ల పాటు వినిపించింది. పార్టీలో ఈ ప్రతిపాదన వచ్చిన వెంటనే రంగనాథరాజు తన వ్యతిరేకతను సంకేతాల రూపంలో అధిష్టానానికి పంపారు. ఆర్థికంగా నిలదొక్కుకున్న రంగరాజు అయితేనే అనుకూలంగా ఉంటుందని, సామాజిక పరంగా కూడా తగినంత మద్దతు కూడగట్టుకో గలుగుతామని వైసీపీ అంచనాకు వచ్చింది. దీనికి భిన్నంగా అంతకు ముందు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న గోకరాజు రంగరాజు (పెద బుజ్జి) పేరు ఇలాగే వినిపించింది. క్రమేణ ఆయ నను జిల్లా సారథ్య పగ్గాల నుంచి తప్పించారు. దీంతో ఎంపీ స్థానాల్లో పోటీ చేసేది ఎవరనే అంశంపై మల్ల గుల్లాలు పడుతుండగా మరో మారు మంత్రి కారుమూరి పేరు ప్రచారంలోకి వచ్చింది.

ఇపుడేమైందంటే..

ఎంపీ అభ్యర్థులు అన్వేషణలో ముప్పుతిప్పలు పడుతూ వచ్చిన వైసీపీ ఈ ప్రాంతంలో ఒక సామాజిక వర్గాన్ని తమ వైపు తిప్పుకునే క్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య పేరును పరిశీలనలో తీసు కుంది. దానికంటే ముందు ఉమ్మడి తూర్పులో ఇదే సామాజిక వర్గంలో కాస్తంత ఆర్థిక పరిపుష్టి కలిగిన నేత కోసం అన్వేషించింది. అక్కడ ఎవరూ సానుకూలంగా స్పందించకపోవడం అంతకంటే మించి ఇపుడున్న రాజకీయ పరిస్థితులు నేపథ్యంలో ఆర్థికభారం మోసేందుకు ఇష్టపడకపోవడంతో ఇక తమ్మయ్య వైపు మొగ్గు చూపారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సీనియర్ నేత పితాని సత్యనారాయణకు స్వయంగా భావ అయిన తమ్మయ్య టీడీపీ నుంచి తప్పుకుని వైసీపీలో చేరారు. అంతకు ముందు 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా నరసాపురం నుంచి పోటీ చేశారు. అప్పట్లో తమ్మయ్యకు అటు చిరంజీవి అభిమానులు, సామాజిక పరంగా కొంత మద్దతుతో లభించడంతో దాదాపు లక్షా 60 వేలకు పైగా ఓట్లు దక్కాయి. నరసాపురం నుంచి టీడీపీ, జనసేన తరుపున ఆర్థికంగా బలోపేతం అయిన అభ్యర్థి రంగంలోకి దిగుతుండడంతో కేవలం బీసీ బాణం చూపించి తమ్మయ్యను రంగంలోకి దింపబోతున్నారు. నరసాపురం పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయడానికి సిద్ధం కండి అంటూ అయనకు మంగళవారం పార్టీ సంకేతాలు ఇచ్చింది. తక్షణం జిల్లా పార్టీ అధ్యక్షుడిగా బేటి కావాలని ఆ తదుపరి పార్టీ అధ్యక్షుడు సీఎం జగన్‌ను కలిసేందుకు రావచ్చునని సూచించారు.ఆర్థికంగా బలహీనుడైనా పార్టీ పరంగా అన్నీ తామే చూసుకుంటామని ఇంకో సంకేతం ఇచ్చింది.

ప్రధాన డిమాండ్‌పైనే మెలిక

నిరాశలో అంగన్‌వాడీలు
విధుల్లో చేరిన సిబ్బంది

భీమవరం, జనవరి 23 :అంగన్వాడీల ఉద్యమం మహోధృతంగా సాగింది.. అయినా ప్రభుత్వం మొండికేయడంతో చివరికి ఆందోళన విరమించక తప్పలేదు. వారు సుదీర్ఘకాలంగా కోరుతున్న డిమాండ్లలో కీలకమైన రూ.18 వేల వేతనం మాత్రం వచ్చే జూలై తరువాత చెల్లిస్తామని హామీ మాత్రమే ప్రభుత్వం ప్రకటించింది. సమ్మె కాలానికి కూడా వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఈ నెల 3 వ తేదీన మంత్రి వర్గ సమావేశంలో కొన్ని డిమాండ్లను ఆమోదం తెలుపుతూ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే తమ ప్రధాన డిమాండ్ అయిన వేతనం విషయమై కొర్రీ పెట్టడంపై అంగన్‌వాడీలు నిరాశతోనే ఉన్నారు. ఉద్యోగాల నుంచి తొలగించడంపై ఆందోళనతో కొంత విధుల్లోకి చేరినట్టు తెలుస్తోంది. గతంలో తమకు హామీ ఇచ్చిన మేరకు రూ.18 వేల వేతనం పెంపుపై ప్రభుత్వం జూలైలో అమలు చేస్తామని చెప్పడంపై కొంతమందిలో నిరాశ ఉన్నప్పటికీ తప్పని పరిస్థితిలోనే విధుల్లో చేరారు. పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయల పోపు దినుసులు, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు విడుదల, ఈ ఏడాది నుంచి రెండు లక్షల రూపాయలు వరకు ప్రమాద బీమా, గర్భవతులకు, బాలింతలకు, పిల్లలకు గతంలో వండి ఇచ్చే ఇబ్బందిని దృష్టిలో ఉంచుకొని టేక్ హోమ్ రేషన్ పద్ధతిని కూడా ప్రవేశపెట్టారు. యిలా కేవలం సంస్థాగత అంశాలకే ప్రభుత్వం ఆమోదం తెలిపిందే తప్ప, కీలకమైన వేతనం పెంపు విషయం మాత్రం పెండింగులో పెట్టారు. చివరికి అంగన్వాడీలపై ప్రభుత్వం వేటు వేస్తూ సోమవారం ఆదేశించింది. డ్యూటీలో చేరనివారిని విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ప్రశాంతి. ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ హెచ్చరికతో చివరకు 507 మంది విధుల్లో చేరగా 3123 మందిపై వేటు వేస్తూ ఉత్తర్వులు ఇవ్వడంతో మంగళవారం వారంతా విధుల్లో చేరారు.

డేంజర్ ఫుడ్..! 5



ఇసుక దందా



బాట పేరుతో అదనపు వసూళ్లు
లారీ ఇసుకకు రూ. 2 వేలు డిమాండ్
అధికార పార్టీ నేతల దోపిడీ
సమ్మెలోకి దిగిన రవాణా యజమానులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఇసుక దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. అధికార పార్టీ నేతలు దోపిడీకి తెరలేపారు. ర్యాంప్‌ల్లో బాట పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ర్యాంప్‌ల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం ఓ ప్రైవేటు ఏజన్సీకి అప్పగించింది. అయినాసరే స్థానికంగా ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే ర్యాంప్‌లు నడుస్తున్నాయి. బాట పేరుతో భారీ మొత్తంలో వసూళ్లు చేస్తున్నారు. రవాణాదారులు దీనిని వ్యతిరేకిస్తున్నారు. వాహనాలు తిప్పకుండా సమ్మె నిర్వహిస్తున్నారు. ప్రతిపక్ష నాయకుల వద్ద తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఇసుక కొనుగోలు చేయాలంటే రవాణా యజమానులే కీలకంగా ఉంటున్నారు. ర్యాంప్‌ల వద్ద కొనుగోలు చేసి వినియోగ దారులకు సరఫరా చేస్తున్నారు. ఏజన్సీకి టన్ను ఇసుకపై రూ.475 చెల్లిస్తున్నారు. అపైన బాట పేరుతో పెద్ద వాహనానికి రూ. 400, చిన్న వాహనానికి రూ. 300 వసూలు చేసేవారు. అంటే 10 టన్నుల ఇసుక కోసం సుమారు రూ. 5,100 వసూలు చేసేవారు. అదే ఇసుకను రవాణా చార్జీలను కలుపుకుని రూ.7500లకు విక్రయించేవారు. 18 టన్నుల ఇసుకకు ర్యాంప్ వద్ద రూ.9100 వరకు ఏజన్సీకి చెల్లించేవారు.మార్కెట్‌లో రూ.14 వేలకు అమ్మకాలు సాగించేవారు.

బాట పేరుతో దోపిడీ

ర్యాంపుల్లో గడచిన కొద్ది రోజులవరకు పాత ధరలే వసూలు చేశారు. బాట పేరుతో రూ. 400 కలిపి మొత్తం పాత ధరలతోనే ఏజన్సీ ఇసుక విక్రయించేది. ఇప్పుడు అదనంగా మరికొంత మొత్తాన్ని దండు కుంటున్నారు. ట్రాక్టర్ అయితే రూ. 500, ఆరు టైర్‌ల లారీకి రూ.1000, 10 టైర్ల వాహనానికి రూ. 1500 అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అదే 12 టైర్ల లారీ అయితే రూ. 2000 అదనంగా చెల్లించాలని పట్టుబడుతున్నారు. ర్యాంప్‌ల వద్ద బాట పేరుతో ఇలా వసూలు చేస్తే మార్కెట్‌లో ధరలు పెంచాలి. అంటే రూ. 7500లకు లభ్యమయ్యే ఇసుక రూ. 8500లకు అమ్ముకోవాలి. ఇప్పటివరకు పెద్ద లారీ అంటే 18 టన్నుల ఇసుక రూ. 14 వేలకు లభ్యమయ్యేది. తాజాగా బాట పేరుతో రూ. 2000 చెల్లించాలంటూ ర్యాంప్ వద్ద నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు.దీనివల్ల మార్కెట్‌లో పెద్దలారీ ఇసుక రూ. 16 వేలకు అమ్మకాలు సాగించాలి. అంత ధర ఇచ్చి కొనుగోలు చేసేవారు లేరు.

రియల్ పతనంలో తగ్గిన డిమాండ్

జిల్లాలో రియల్ ఎస్టేట్ పతనమైంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో నిర్మాణం పూర్తిగా కుదేలైంది. రియల్టర్‌లు తెలంగాణకు వెళ్లిపోయారు. మరోవైపు జిల్లాలో నిర్మాణాలు చేపట్టాలంటే అధికార పార్టీ నేతలకు ముడుపులు చెల్లించాల్సి వస్తోంది. ఇవన్నీ నిర్మాణ రంగాన్ని దెబ్బతీశాయి. దాంతో జిల్లాలో ఇసుక విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. గతంలో ఇతర జిల్లాలతో పాటు, హైదరాబాద్‌కు రవాణా చేసేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక రవాణా దారులకు కష్టకాలం దాపురించింది. తొలిరోజుల్లో కొత్త విధానం తీసుకొస్తామని ఏడాది పాటు ప్రభుత్వం తాత్సారం చేసింది. ర్యాంప్‌లు నిలిపివేసింది. ఆ తర్వాత ప్రభుత్వ ఆధ్వర్యంలోనే అమ్మకాలు సాగించారు. అధికార పార్టీ నేతలు అడ్డంగా దోచుకున్నారు. వినియో గదారులకు ధరలు భారమయ్యాయి. దాంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఒకే ఏజన్సీకి తవ్వకాలను కట్టబెట్టింది. అప్పటికే జిల్లాలో నిర్మాణరంగం పడిపోయింది. ప్రభుత్వం కొత్తగా మరో ఏజన్సీకి ఇసుక తవ్వకాల బాధ్యతను అప్ప గించారు. దాంతో బాట పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. దానివల్ల ధరలు పెంచి విక్రయించాల్సి ఉంటుందని రవాణా యజమానులు గగ్గోలు పెడుతున్నారు.

సమ్మెలో వాహనాలు

ర్యాంప్‌ల వద్ద అదనపు వసూళ్లకు పాల్పడుతుండడంతో రవాణా యజమానులు సమ్మె చేపడుతున్నారు. నాలుగు రోజులుగా ఇసుక రవాణా నిలిపివేశారు. జిల్లాలో సిద్ధాంతం, కోడూరుతో పాటు,తూర్పుగోదావరిలో పెండ్యాల ర్యాంప్‌ల నుంచి ఇసుక రవాణా చేస్తుంటారు. ఇప్పుడు వాహనాలు సమ్మెలో ఉన్నాయి. నందమూరు వద్ద స్టాక్ పాయింట్ నుంచి అమ్మకాలు నిర్వహించకుండా రవాణా యజమానులు అడ్డుకుంటున్నారు. అదనపు సొమ్ము వసూళ్లు నిలిపివేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

ఉచిత విధానాన్నే తప్పు పడుతోంది

తెలుగుదేశం హయాంలో ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేశారు. లారీ ఇసుక రూ. 10 వేలకు మార్కెట్‌కు వచ్చేసేది. అదే ఇసుక ఇప్పుడు అదనపు వసూళ్లతో రూ. 16 వేలకు అమ్మకాలు చేయాల్సి వస్తోంది. కానీ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అప్పటి ఉచిత విధానాన్ని తప్పు పడుతోంది. వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక లభించిందన్న విషయాన్ని విస్మరించింది.



ర్యాంప్‌లో సిద్ధంగా ఉన్న ఎక్స్ కవేటర్.. బాట వేసేందుకు కొబ్బరి ఆకులు

ఆ..రెండుచోట్ల బాట ఏర్పాటుకు రెడీ

ఆచంట, జనవరి 23: కొంత మంది నాయకులు నియోజకవర్గంలోని సిద్ధాంతం, నడిపూడి ర్యాంప్‌లలో ఇసుకను అక్రమంగా తరలించేందుకు బాటలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే ఈ రెండు ర్యాంప్‌లలో కొంతమంది ఇసుక, మట్టిని అక్రమంగా తరలించినట్టు ఆరోపణలు ఉన్నాయి. బాటలు ఏర్పాటు చేసేందుకు ర్యాంపుల వద్దకు ట్రాక్టర్ల ద్వారా కొబ్బరి ఆకులను తరలించినట్లు సమాచారం. అయితే ప్రస్తుతానికి నియోజకవర్గంలో ఏ ర్యాంప్‌లకు కూడా అనుమతులు లేవు. ఇటీవలే నడిపూడి ర్యాంప్‌లో ఇసుక సరఫరా ప్రారంభించగా అనుమతులు లేకపోవడంతో అధికారులు నిలుపుదల చేశారు.రాత్రి వేళల్లో అక్రమంగా తరలించేందుకు కొంతమంది నేతలు ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం.

ఎటువంటి అనుమతులు లేవు : తహసీల్దార్

సిద్ధాంతం, నడిపూడి ఇసుక ర్యాంప్‌లకు సంబంధించి ఇసుక తీయడానికి ఎటువంటి అనుమతులు లేవు. ప్రస్తుతానికి ఈ ర్యాంప్‌ల నుంచి ఎటువంటి ఇసుక సరఫరా అవడం లేదు. అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.



నోరూరించేలా రంగులు కలిపి వండిన చికెన్, మటన్, ఫిష్ ఫ్రై



డేంజర్ ఫుడ్..!

- కృత్రిమ రంగుల పౌడర్‌తో ఆహార పదార్థాల తయారీ
- ప్రజల ఆరోగ్యంతో హోటల్ యజమానుల చలగాటం
- దాడులు జరిగినా యథేచ్ఛగా విక్రయాలు
- పట్టించుకోని అధికారులు.. అనారోగ్యంబారిన ప్రజలు?

జంగారెడ్డిగూడెం, జనవరి 23 : నిబంధనలకు నీళ్లొదిలి ఆరోగ్యానికి హానికరమైన కృత్రిమ రంగుల పౌడర్‌తో ఆహార పదార్థాలు తయారు చేస్తుండడంతో భోజనప్రియులు బెంబేలెత్తుతున్నారు. నియంత్రించాల్సిన అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో జిల్లాలో కొన్ని బడా హోటళ్లు, రెస్టారెంట్లలో యథేచ్ఛగా వండి వడ్డించేస్తున్నారు. వివరాల్లోకి వెళితే ఈ నెల 18న పట్టణంలోని ముబారక్ కచ్చీ బిర్యాని పాయింట్‌లో ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీ చేశారు. డొమెస్టిక్ సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌లను వంటకాలకు వాడుతున్నట్టు గుర్తించి 23 గ్యాస్ బండ్‌లను సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేశారు. మరుసటి రోజు, ఆహార పదార్థాల్లో కృత్రిమరంగుల పౌడర్‌లను వాడుతున్నారన్న సమాచారంతో తినేరా రెస్టారెంట్‌పై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ మెట్రాలజీ, ఆహార పదార్థాల తనిఖీ అధికారులు సంయుక్తంగా దాడి చేసి 15 రకాల కృత్రిమ రంగుల పౌడర్ డబ్బాలను గుర్తించి ధ్వంసం చేశారు. ఆహార పదార్థాల నమూనాలను ల్యాబ్‌కు పంపారు. చికెన్, మటన్, చేప, ఎగ్, రొయ్య, కౌజు పిట్టల వంటకాలపై రెస్టారెంట్, హోటల్ యజమానులు కొత్తకొత్త ప్రయోగాలు చేస్తున్నారు. వాటిలో భాగంగానే మాంసం ముద్దల రంగును మార్చేందుకు ఆరోగ్యానికి హానికరమైన ఎన్నో రసాయన పౌడర్‌లను వాడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నియంత్రించాల్సిన అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో జిల్లాలో కొన్ని బడా హోటళ్లు, రెస్టారెంట్‌లలో నాణ్యత లేని, రసాయన పౌడర్‌లు కలిసిన ఆహార పదార్థాలను ప్రజలకు విక్రయిస్తున్నారు. దీంతో అనారోగ్యంబారిన పడుతున్నారు.

హోటల్ లేదా రెస్టారెంట్‌ను నిర్వహించేందుకు షెడ్యూల్-4 ప్రకారం 21 నిబంధనలు ఉన్నాయి. ప్రధానంగా ఫుడ్ లైసెన్స్ ఉండాలి. దాని కాలపరిమితి ఎప్పటికప్పుడు రెన్యువల్ చేయించుకోవాలి. వంటశాల అత్యంత శుభ్రంగా ఉండాలి. దుర్వాసనలు రాకూడదు. డ్రెయినేజీ వ్యవస్థ ఉండాలి. కృత్రిమ రంగులను ఆహార పదార్థాల్లో వాడకూడదు. నలభీముల ఆరోగ్య పరిస్థితులపై సర్టిఫికెట్‌లు కలిగి ఉండాలి. కానీ నిబంధనలు తుంగలోతొక్కి హోటళ్లు రన్ చేస్తున్నారు. ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులకు తెలిసిన వారు పట్టించుకోవడం లేదని బహిరంగంగానే ప్రజలు విమర్శిస్తున్నారు.

ప్రభుత్వ విధానాలు.. టీచర్ పోస్టుల భర్తీపై పెనుప్రభావం

- అరకొర నియామకాలతో నిరుద్యోగులకు ఎన్నికల గాలం

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 23: డీఎస్సీ-2024 రిక్రూట్‌మెంట్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఖాళీల సంఖ్యపై ప్రాథమిక సమాచారం అందింది. అన్ని కేడర్లు, సబ్జెక్టుల్లో సుమారు 470 పోస్టులు ఉండవచ్చునని తెలిసింది. అయితే రిటైర్డ్ ఉపాధ్యాయుల పోస్టులు, ఉద్యోగ విరమణచేయనున్న టీచర్ల ఖాళీలను కూడా కొత్త డీఎస్సీలోనే చేర్చాలని ప్రభుత్వం నిర్ణయిస్తే పోస్టుల సంఖ్య పెరిగేందుకు అవకాశాలున్నాయి. ప్రాథమిక తరగతులను సమీప హైస్కూళ్లలోకి విలీనం, పలు తరగతులకు తెలుగుమాధ్యమ సెక్షన్ల ఎత్తివేత, వీటి ప్రభావంతో ప్రభుత్వ పాఠశాలల్లో భారీగా తగ్గిపోయిన విద్యార్థుల సంఖ్య, దీనికనుగుణంగానే టీచర్ల రేషనలైజేషన్, మిగులు టీచర్‌పోస్టులను ఇతర జిల్లాలకు తరలించడంతో ఉమ్మడిజిల్లాలో కొత్తగా ఉపాధ్యాయ నియామకాలపై పెనుప్రభావమే చూపిందని తెలిసింది. 30 శాతం ఉపాధ్యాయ ఖాళీలను ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇన్‌సర్వీస్ టీచర్లకు పదోన్నతులు ఇవ్వడం ద్వారా భర్తీచేసేయడం వల్ల పోస్టుల సంఖ్యలో కోత పడటానికి ఓ కారణమని చెబుతున్నారు. పూర్వపు డీఎస్సీల్లో ఎంపికై వివిధ కారణాలవల్ల నియమితులుకాలేకపోయిన నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులను కనీస వేతన స్కేలు (ఎంటీఎస్)పై 430 ఎస్జీటీ పోస్టుల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించడంవల్ల ఆ మేరకు ఉద్యోగఖాళీలు తగ్గిపోయాయని విశ్లేషిస్తున్నారు. ఫిజికల్ డైరెక్టర్, స్కూల్ అసిస్టెంట్ హిందీ, ఇంగ్లీషు సబ్జెక్టుల్లోనే కొత్త నియామకాలు ఎక్కువగా జరిగే అవకాశాలున్నట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. మిగతా సబ్జెక్టుల్లో రెండంకెల్లోనే నియామకాలుంటాయని సమాచారం. ఎంటీఎస్ టీచర్లను నియమించిన రెగ్యులర్ ఖాళీలను కూడా భర్తీచేయాలని ప్రభుత్వం నిర్ణయిస్తే ఆ మేరకు పోస్టుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. దీంతోపాటు ఈ ఏడాది జనవరి నెలాఖరువరకు ఉద్యోగ విరమణ ద్వారా ఖాళీ అయ్యే పోస్టులను కొత్త డీఎస్సీలోనే చేర్చితే పోస్టుల సంఖ్య కొంతమేర పెరగడానికి ఛాన్స్ ఉంది. తొలుత 'టెట్' నిర్వహించిన తర్వాతే డీఎస్సీ రాతపరీక్షను జరుపుతామని గతంలో పలు సందర్భాల్లో ప్రభుత్వం చెప్పింది. తాజాగా జరుగుతున్న ప్రచారంలో టెట్ ప్రస్తావన లేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకివచ్చిన నాలుగున్నరేళ్లలో డీఎస్సీని చేపట్టకుండా ఇపుడు అత్యవసరంగా ఉపాధ్యాయ నియామకాలను తెరపైకి తీసుకురావడం ఎన్నికల స్టంట్‌గా భావిస్తున్నారు. ఏపీ రెసిడెన్షియల్, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లోని ఉపాధ్యాయ పోస్టులను కూడా కలిపి డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తారని మరోప్రచారం ఉంది. ఇదిలాఉండగా ఉమ్మడి జిల్లాలో కొత్త డీఎస్సీకి నోటిఫైచేసే ఉపాధ్యాయపోస్టుల సంఖ్యపై ఇంతవరకు ఎటువంటి అధికారిక సమాచారం లేదని విద్యాశాఖవర్గాలు స్పష్టం చేశాయి. పాఠశాలలవారీగా ప్రభుత్వం వద్ద వున్న యూ-డైస్ సమాచారంతో నియామకాల సంఖ్యను నిర్ధారిస్తారని తెలిపాయి.

చిరుధాన్యాల సాగుపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న భరతలక్ష్మి

పెదవేగి, జనవరి 23 : రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని, అప్పుడే ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ ఎం. భరతలక్ష్మి అన్నారు. ప్రధానంగా చిరుధాన్యాల సాగు లాభసాటిగా ఉంటుందని ఆమె చెప్పారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని ఏలూరు ఏరువాక కేంద్రం, వ్యవసాయశాఖ సంయుక్తంగా పెదకడిమి రైతు భరోసా కేంద్రంలో చిరుధాన్యాల సాగు, విలువల జోడింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని చెప్పారు. నీటిఎద్దడిని సైతం తట్టుకుని దిగుబడులు వస్తాయని, రైతులు చిరుధాన్యాల సాగువైపు మళ్లాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ వై.రామకృష్ణ, పెద్దాపురం వ్యవసాయ పరిశోధనాకేంద్రం అధిపతి డాక్టర్ పి.మునిరత్నం, ఏలూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ టి.సుజాత, ఉండి కృషి విజ్ఞానకేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.డెబోరా, పెద్దాపురం వ్యవసాయ పరిశోధనాకేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఐ.సుధీర్ కుమార్, ఏలూరు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.ఫణికుమార్, విజయవాడ సీపీపీఐ ప్రధాన శాస్త్రవేత్త వీరబాబు, ఏలూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎస్.నాగేంద్రబాబు, ఏడీఏ శ్రీదేవి, ఏవో ఎం.ప్రియాంక పాల్గొన్నారు.



గురుకుల విద్యార్థుల బ్యాండ్ ట్రూప్

గురుకుల బ్యాండ్‌కు జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 23: పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల బ్యాండ్ ట్రూప్ జాతీయస్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియంలో రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా ఈనెల 21, 22 తేదీల్లో జాతీయస్థాయిలో 14 పాఠశాలలు పాల్గొన్న బ్యాండ్ పోటీల్లో బాలుర విభాగంలో సౌత్‌జోన్ తరఫున ప్రాతినిధ్యం వహించి ద్వితీయ స్థానంలో నిలిచినట్టు ప్రిన్సిపాల్ బి.రాజారావు వివరించారు. బ్యాండ్ ట్రూప్‌ను సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల సెక్రటరి మహేష్‌కుమార్, రాష్ట్ర సమగ్ర అభియాన్ అధికారి శ్రీనివాసరావు, మంత్రి కొట్టు సత్యనారాయణ అభినందించారు.

కల సాకారమయ్యేనా..!

భద్రాచలం-కొవ్వూరు రైల్వేమార్గం ప్రతిపాదనలు బుట్టదాఖలేనా?

- బడ్జెట్ నిల్.. సర్వేలతోనే సరిపెడుతున్న కేంద్రం
- ఏజెన్సీ ప్రాంతాల నుంచి ప్రభుత్వాలకు ఏటా రూ.200 కోట్ల ఆదాయం
- అభివృద్ధిపై దృష్టిపెట్టని పాలకులు

ఏలూరు క్రైం, జనవరి 23 : దేశం అభివృద్ధి చెందాలంటే రవాణా మార్గం ఎంతో ముఖ్యం. రోడ్డు, జల, రైల్వే, వాయు మార్గాలు త్వరితగతిన అభివృద్ధి చేస్తే ఏ దేశమైనా ప్రపంచపటంలో అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరుతుంది. జిల్లాలో పండుతున్న వాణిజ్య పంటలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల రూపంలో సిరిసంపదలు కురిపిస్తున్నా కనికరం లేకుండా పోతోంది.

1925 ఏప్రిల్‌లో పశ్చిమ గోదావరి జిల్లా ఏర్పడింది. అప్పట్లో పెదవేగి, తాడేపల్లిగూడెంలలో విమానాశ్రయాలు ఉండేవి. ఇవి రెండో ప్రపంచ యుద్ధంలో ఇంధనం నింపుకోవడానికి ఏర్పాటు చేసినవే అయినప్పటికీ ఆ తరువాత రవాణాకు ఉపయోగించారు. క్రమేపీ అవి అంతరించిపోయాయి. తాడేపల్లిగూడెం విమానాశ్రయ భూముల్లో నిట్ ఏర్పాటు చేయగా, పెదవేగి విమానాశ్రయమార్గాన్ని జంగారెడ్డిగూడెం-ఏలూరు రోడ్డుగా మార్చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భద్రాచలం-కొవ్వూరు రైల్వేమార్గం ఆవశ్యకతను 1948-49లోనే గుర్తించారు. మరలా 1950-55 మధ్య, 1972 ఆగస్టులో పోస్టల్ ఇండెక్స్ నెంబర్ వ్యవస్థను దేశం మొత్తం అమలు చేసే సమయంలో కూడా భద్రాచలం- కొవ్వూరు రైల్వే మార్గం వల్ల రాజమహేంద్రవరం, విశాఖపట్నం రైల్వే స్టేషన్‌ల నుంచి నడిచే రైళ్లకు అవసరమైన బొగ్గును తెలంగాణ నుంచి సరఫరా చేయడానికి రైలు మార్గం ఎంతో ముఖ్యమని భావించారు. బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేయలేకపోయారు. 1990-91 కేంద్ర బడ్జెట్‌లో కొద్దిపాటి నిధులను కేటాయించి సర్వే జరిపించారు. భద్రాచలం నుంచి కొవ్వూరుకు 170 కిలోమీటర్ల రోడ్డు మార్గం ఉండగా రాజమండ్రి వరకు 180 కిలోమీటర్లు వస్తుంది. రైలు మార్గం భద్రాచలం నుంచి కొవ్వూరుకు 154 కిలోమీటర్లు వస్తుందని అంచనా వేశారు. అటవీ ప్రాంతం మీదుగా వాగులు, వంకలు, కాలువలు ఉండడంతో 78 చిన్న పెద్ద బ్రిడ్జిలు కట్టాల్సివస్తోందని గేట్లు కూడా ఎక్కువే పెట్టాల్సి వస్తోందని గుర్తించారు. అయితే అటవీ ప్రాంతం మీదుగా రైలు మార్గం వేయాలంటే కేంద్ర పర్యావణశాఖ అనుమతి పొందాల్సి ఉంటుంది.

భద్రాచలం నుంచి కొవ్వూరుకు రెండు రకాల రైలు మార్గాలను ప్రతిపాదించారు. ఒకటి అత్యంత దగ్గరగా భద్రాచలం నుంచి దమ్మపేట, అశ్వరావుపేట, కామయ్యపాలెం, గంగన్నగూడెం, స్వర్ణవారిగూడెం, మైసన్నగూడెం, శ్రీనివాసపురం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, గోపాలపురం, చిక్కాల, గౌరీపట్నం మీదుగా పతిపాదనలు చేశారు. భూ సేకరణకు ఎంత ఖర్చు అవుతుందో నిర్ణయించారు. కేవలం సర్వేలకు మాత్రమే పరిమితం అయింది. ఆ ప్రాంతానికి చెందిన నేతలు భద్రాచలం ఎంపీగా, కేంద్ర మంత్రులుగా పనిచేసినప్పటికీ ఎలాంటి అభివృద్ధి చేయలేదంటూ ఆప్రాంత వాసులు చెబుతున్నారు. పోలవరం, చింతలపూడి, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల ప్రజలకు ఈ రైల్వే మార్గం ఎంతో దోహదపడుతుంది. వాణిజ్య పంటలైన వర్జీనియా పొగాకును అత్యధికంగా ఈ ప్రాంతాల్లోనే పండిస్తు ఉంటారు. కేంద్ర ప్రభుత్వానికి ఏడాదికి పన్నుల రూపంలోనే లక్షా 25 వేల కోట్లు విదేశీ మాదకద్రవ్యం లభిస్తుంది. పామాయిల్ తోటలు విరివిగా ఉండడంతో ఇక్కడే ఫ్యాక్టరీలు కూడా వెలిశాయి. కేంద్ర ప్రభుత్వం పామాయిల్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటూ రూ. 60 వేల కోట్లు విదేశీ సుంకాన్ని చెల్లించేది. ప్రస్తుతం ఈ భారం తగ్గిపోయింది. వివిధ పంటల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏడాదికి రూ.200 కోట్లు పన్నుల రూపంలో వెళ్తున్నప్పటికి అభివృద్ధిని ఏఒక్క నాయకుడు పట్టించుకోలేదు. తెలంగాణ నుంచి నిత్యం వందలాది గ్రానైట్ లోడు లారీలు అశ్వారావుపేట నుంచి జంగారెడ్డిగూడెం మీదుగా రాజమండ్రి నుంచి కాకినాడ పోర్టుకు వెళ్తానే ఉంటాయి. భద్రాచలం నుంచి కొవ్వూరు వరకూ రైలు మార్గం ఉంటే అతి తక్కువ ఖర్చుతో రవాణా జరిగేది.



రోడ్డు మార్గంలో గ్రానైట్ లోడు లారీలు వెళ్లడంతో జీలుగుమిల్లి నుంచి దేవరపల్లి వరకూ రహదారులు ధ్వంసమౌతున్నాయి. మెట్ట ప్రాంతంలో వర్జీనియా పొగాకు, పామాయిల్, జీడిమామిడి, మామిడి, వరి, నిమ్మ పంటలు పండిస్తున్నారు. వీటి రవాణాకు రైల్వే మార్గం ఎంతో ముఖ్యమని ఆ ప్రాంత రైతులు చెబుతున్నారు. ఈసారి బడ్జెట్‌లోనైనా జిల్లాకు చెందిన ఎంపీ కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి క్షేత్రస్థాయిలో పనులు చేపట్టేందుకు కృషిచేస్తారా లేదా అని ఈ ప్రాంత ప్రజలు చర్చించుకుంటున్నారు. మరోవైపు చింతలపూడి ప్రాంతంలో బొగ్గుగనులు విరివిగా ఉన్నాయి. అవి జంగారెడ్డి గూడెం వరకు విస్తరించి ఉన్నాయి. ఈ రైలు మార్గం అభివృద్ధికి అవకాశాలు ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో కేవలం ప్రకటనలకే పరిమితమైపోతున్నాయి. భద్రాచలం నుంచి కొవ్వూరు రైలు మార్గం స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కలగానే మిగిలిపోతోంది.

ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా



ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లను సత్కరిస్తున్న జోనల్ చైర్మన్ పిన్నింటి

భీమవరంటౌన్, జనవరి 23 : ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని జోనల్ చైర్మన్ పిన్నింటి మహేష్ హామీ ఇచ్చారు. జోనల్ ఛైర్మన్‌గా బాధ్యలు చేపట్టి మొదటిసారిగా భీమవరం డిపో పరిశీలన నిమిత్తం సోమవారం వచ్చిన ఆయన కార్మికులతో మాట్లాడారు. ఈనెల 30న బోర్డు మీటింగ్ జరుగుతుందని, ఈ విషయాన్ని చైర్మన్ దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. జోన్‌కు కొత్తగా 400 బస్సులు రానున్నాయని, వాటిని డిపోల వారీగా అందించటం జరుగుతుందన్నారు. వర్షం వస్తే గ్యారేజీ మునిగిపోతుందని, బస్సులు దెబ్బతింటున్నాయని, గతంలో చాలాసార్లు ప్రతిపాదనలు చేసి పంపినా నిధులు మంజూరు కాలేదని సంఘ నేతలు ఆయన దృష్టికి తెచ్చారు. డిసెంబరులో అత్యధిక కెఎంపిఎల్, అత్యధిక ఆదాయం తెచ్చిన డ్రైవర్‌లు ఎస్.ఎ.నారాయణ (ప్రథమ), ఎస్‌వి.ఎస్.ఎ. రావు (ద్వితీయ),ఎస్.ఎం.రావు(తృతీయ)లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కండక్టర్‌లు కె.పద్మావతి (ప్రథమ), వి.రాంబాబు(ద్వితీయ), జె.ఎచ్.ఎస్. ప్రసాద్ (తృతీయ)లను అభినందించి ఒక్కొక్కరికి రూ.500, రూ.400, రూ.300 నగదు, ప్రశంసా పత్రాలను అందించారు. డిపో మేనేజర్ పి.ఎస్.వి.ఎం. సత్యనారాయణ మూర్తి, అసిస్టెంట్ మేనేజర్ సురేష్, గుండా రాంబాబు, బాల సుబ్రహ్మణ్యం, యూనియన్ నేతలు అల్లం నారాయణ, డి. విజయ్‌కుమార్, సోమరాజు, రమేష్‌బాబు, వైవిరావు ఉన్నారు.

ఏఎన్‌ఎంలకు కులగణన విధులపై అభ్యంతరం

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 23 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన విధులను గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎన్‌ఎంలకు అప్పగిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీచేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏఎన్‌ఎంలను వైద్యేతర కార్యకలాపాలకు వినియోగించడం అభ్యంతరకరమని ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లా అప్పారావు అన్నారు. ఏలూరు జిల్లాలో 600 మందికిపైగా ఏఎన్‌ఎంలకు కులగణన విధులు కేటాయిస్తూ జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీచేశారని, ఏఎన్‌ఎంలను వైద్యేతర విధులకు వినియోగించరాదని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఎం.టి.కృష్ణబాబు జారీచేసిన సూచనలను అధికారులు విస్మరించడం విచారకరమన్నారు.

మెడికల్ కాలేజీ నిర్మాణం వేగవంతం చేయాలి

పాలకొల్లు రూలర్, జనవరి 23: మండలంలోని దగ్గులూరులో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులను మంగళవారం నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్ తనిఖీ చేశారు. అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, అత్యవసర బ్లాక్, ఓపీడి బ్లాక్ పైల్ ఫౌండేషన్‌కు జరుగుతున్న కాంక్రీట్ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు.

పూలశాస్త్ర పరిశోధనలో ప్రణతికి జాతీయ పురస్కారం



ప్రణతిని అభినందిస్తున్న జానకిరామ్

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 23: పూలశాస్త్ర పరిశోధనలో అత్యుత్తమ థీసెస్ సమర్పించిన యువ శాస్త్రవేత్త కేటగిరిలో డాక్టర్ వైఎస్ఆర్ విశ్వవిద్యాలయ ఉద్యానకళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పసుపులేటి ప్రణతి జాతీయ స్థాయి పురస్కారం అందుకున్నారు. గుజరాత్‌లోని నౌసారి వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన జాతీయస్థాయి హార్టీకల్చర్ కాంక్లేవ్‌లో పీహెచ్‌డీ కోర్సుల్లో అత్యుత్తమ పరిశోధనా పత్రం సమర్పించిన ప్రణతికి ఈ అవార్డు లభించింది. ఆమెను ఉపకులపతి డాక్టర్ టి. జానకిరామ్ మంగళవారం అభినందించారు.



నీరందక నెర్రలు

కళింగగూడెంలో సాగునీటి కష్టాలు

ఆకివీడు రూరల్/ఆకివీడు, జనవరి 23 : వరి పొలాలు నెర్రలు తీస్తున్నాయి. సాగునీటికి రైతులు ఎదురు చూస్తున్నారు. కళింగపాలెం లాకుల ప్రాంతంలో వెదజల్లిన వరి పొలాలు సాగునీరు అందక బీటలు వారాయని, పొలాల్లో నడిచి వెళ్లవచ్చని రైతులు వాపోతున్నారు. పాతవయ్యేరు శివారు ప్రాంతం కావడంతో సాగునీరు ఇప్పటివరకు చేరలేదని, నీరందకపోతే చేను చనిపోతుందని చెబుతున్నారు. అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని రైతు తాండ్ర జోగిరాజు ఆవేదన వ్యక్తం చేశారు.

నారు కొరత.. ఎకరానికి రూ.7 వేలు అదనపు ఖర్చు



ట్రాక్టర్‌పై తీసుకెళ్తున్న వరినారు

మిచౌంగ్ తుఫాన్ ప్రభావం చినమిల్లిపాడు, రాజులపేట రైతులను వెంటాడుతోంది. నారు కొనుగోలు చేసి నాట్లు వేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. దాళ్వా ప్రారంభ సమయంలో రైతులు వేసిన ఆకుమడులు ముంపునకు గురయ్యాయి. చేలలో నీరు తగ్గకపోవడంతో ఎకరానికి రూ.7 వేలు పెట్టి వరి నారు ఇతర గ్రామాల నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన రైతులకు నేటికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదని అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నామంటున్నారు.

క్రైం కార్నర్

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ఏలూరు క్రైం, జనవరి 23 : ఓ మహిళను దిండుతో ఊపిరాడకుండా హత్య చేసి, ఆపై ఆమె ఉరి వేసుకున్నట్టు సాక్ష్యాలు తారుమారు చేసిన నిందితుడిపై నేరం రుజువు కావడంతో అతడికి జీవిత ఖైదు, రూ. పది వేల జరిమానా విధిస్తూ ఏలూరులో ఎనిమిదవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎం.సునీల్‌కుమార్ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం పెదపాడు మండలం ఏపూరు గ్రామానికి చెందిన అల్లాడి దుర్గ.. భర్త మరణించడంతో ఆమె తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఆమెకు కృష్ణాజిల్లా బాపులపాడు మండలం హనుమాన్‌జంక్షన్‌కు చెందిన బెజవాడ వీరవెంకట శివశంకర్ అలియాస్ శివశంకర్ (24)తో వివాహేతర సంబంధం ఏర్పడింది. కొంత కాలం సహజీవనం చేసి విడిపోయారు. ఈ నేపథ్యంలో 2015 డిసెంబరు 13న తన కోరిక తీర్చాలంటూ దుర్గను కోరాడు. ఆమె నిరాకరించడంతో దిండు తలపై పెట్టి ఊపిరి ఆడకుండా చేశాడు. అనంతరం చీరతో ఉరేసుకున్నట్లుగా చిత్రీకరించి పారిపోయాడు. మృతురాలి తల్లి పోరుకొండ ఝాన్సీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి పెదపాడు ఎస్‌ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేయగా, ఏలూరు డీఎస్పీ కె.బి.జి. సరిత కేసు దర్యాప్తు చేసి హంతకుడిని అరెస్టు చేసి కోర్టులో ఛార్జిషీటు వేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో పైవిధంగా న్యాయాధికారి తీర్పు చెప్పారు. అతడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాణీభాయ్ వాదించగా, పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాసరావు, పెదపాడు ఎస్‌ఐ చల్లాకృష్ణ, కోర్టు కానిస్టేబుళ్లు సిహెచ్.క్రాంతికుమార్, పవన్‌కుమార్ సహకరించారు. వీరిని ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఫుడ్ డెలివరీ బాయ్‌కు గాయాలు

జంగారెడ్డిగూడెం, జనవరి 23: రోడ్డు ప్రమాదంలో ఫుడ్ డెలివరీ చేస్తున్న ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలివి. పట్టణానికి చెందిన సుంకవల్లి రవి ఫుడ్‌డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. స్థానిక బాలాజీ నగర్‌కు ఫుడ్ డెలివరినిమిత్తం మంగళవారం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా హైవేపై కొయ్యలగూడెం వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో రవి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రైటర్ శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యంపై కేసు

జంగారెడ్డిగూడెం, జనవరి 23: వివాహిత అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి. పట్టణానికి చెందిన ఓ వివాహిత ఈనెల 21 నుంచి అదృశ్యమైంది. బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల వెదికినా కన్పించకపోవడంతో మంగళవారం ఆమె భర్త ఫిర్యాదుతో స్టేషన్ రైటర్ శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోగొట్టుకున్న ఫోన్ దుబాయ్ భక్తురాలికి అందజేత

ద్వారకాతిరుమల, జనవరి 23: స్వామి దర్శినానికి శ్రీవారి క్షేత్రానికి వచ్చి ఓ ఖరీదైన ఫోన్ పోగొట్టుకున్న విదేశీ భక్తురాలికి తిరిగి ఆ ఫోన్‌ను అప్పగించారు. వివరాలివి. దుబాయ్‌లో ఉంటున్న శ్రావ్య అనే భక్తురాలు మంగళవారం చినవెంకన్న దర్శనార్థం ద్వారకాతిరుమల వచ్చారు. స్వామి దర్శనం అనంతరం ఆమె తన ఫోన్ పోగొట్టుకున్నట్లు గుర్తించారు. ఆలయ ప్రాంగణంలో ఆఫోన్‌ను గుర్తించిన ఆలయ సెక్యూరిటీ మైక్‌లో అనౌన్స్ చేశారు. దీంతో ఆమె గుర్తులు చెప్పగా దానిని అప్పగించారు.

లారీ ఆఫీసులో స్క్రాప్ చోరీ..

- పోలీసులకు నిందితుడి అప్పగింత

ఆకివీడు, జనవరి 23: లారీఆఫీసులో జరిగిన దొంగతనంపై పోలీసులు కేసు నమోదుచేశారు. వివరాలివి. స్థానిక గుమ్ములూరు రోడ్‌లో ఉంటున్న గంధం సుబ్బారావుకు చెందిన లారీ ఆఫీసులో చిత్తు కాగితాలు ఏరుకొనే వ్యక్తి మంగళవారం స్క్రాప్ దొంగతనం చేస్తుండ పట్టుబడ్డాడు. దొంగను పోలీసులకు అప్పగించారు. ఆఫీసు సిబ్బంది ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం, వెండి వస్తువుల అపహరణ

జంగారెడ్డిగూడెం, జనవరి 23 : విధులకు వెళ్లి వచ్చేలోగా ఓ హెల్త్ సూపర్‌వైజర్ ఇంట్లో దొంగలుపడి బంగారం, వెండి, నగదు దోచుకెళ్లారు.. వివరాలివి. పట్టణంలో నివాసం ఉంటున్న అల్లాడి సరస్వతి తాడువాయి పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం తాడువాయి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూస్తే ఇంటి తలుపులు, బీరువా తాళాలు పగలకొట్టి ఉండటాన్ని గమనించింది. రెండున్నకాసుల బంగారం, వెండివస్తువులు, రూ.20 వేలు అపహరణకు గురైనట్టు గుర్తించి మంగళవారం పోలీసులు ఫిర్యాదు చేశారు.

పోలీసులు అదుపులో 8 మంది కోడిపందేలరాయుళ్లు

జంగారెడ్డిగూడెం, జనవరి 23 :కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వివరాలివి. శ్రీనివాసపురం శివారులో మంగళవారం కోడిపందేలు వేస్తున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సిబ్బందితో దాడి చేశారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని రూ.3,400, రెండు కోళ్లు, ఒక కోడికత్తి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

బెల్టు షాపుపై..

పట్టణంలోని బాలాజీ నగర్‌లో బెల్ట్ షాపుపై మంగళవారం పోలీసులు దాడి చేసి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని రూ.540 విలువ చేసే నాలుగు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆరో రోజూ సెల్‌టవర్‌పైనే..

భీమవరం క్రైం, జనవరి 23 : తనకు రావాల్సిన జనరల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పత్రాలు ఇవ్వడం లేదంటూ గత ఆరు రోజులుగా లోకం ఏసు అనే వ్యక్తి సిల్‌టవర్‌పైనే ఉన్నాడు. గురువారం ఉదయం ఎక్కిన అతడు మంగళవారం రాత్రి కూడా దిగలేదు. పోలీసు, రెవెన్యూ, ఫైర్ అధికారులు అక్కడే వేచి చూస్తున్నారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా కూడా అతడు కిందకు దిగడం లేదు.

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు దెందులూరు వాసి



వినోద్ కుమార్

దెందులూరు, జనవరి 23 : ఢిల్లీలో ఈ నెల 26న నిర్వహించే గణతంత్ర వేడుకలకు దెందులూరుకు చెందిన కొత్తపల్లి వినోద్ కుమార్ ఎంపికయ్యాడు. కొప్పాకలో ఆయూష్మాన్ భారత్, ఆయూష్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లోని ఆయుర్వేద వైద్యశాలలో యోగా శిక్షకుడిగా అతడు పని చేస్తున్నాడు. కేంద్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సాధిక్ ఖాన్.. వినోద్‌ను ఎంపిక చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అతడు మంగళవారం ఢిల్లీ బయలుదేరి వెళ్లాడు. ప్రధాని మోదీతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొనే వేడుకల్లో యోగాపై అవగాహన కల్పించనున్నారు.

చల్లావారిగూడెం నిర్వాసితకాలనీలో సినీ సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్



నిర్వాసితులతో మాట్లాడుతున్న పట్నాయక్

జంగారెడ్డిగూడెం, జనవరి 23 : మండలంలోని చల్లావారిగూడెంలో నిర్మించే ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మంగళవారం ప్రముఖ సినీ సంగీత దర్శకులు ఆర్పీ పట్నాయక్ పర్యటించారు. త్వరలో తెరకెక్కనున్న ఓ చిత్రానికి సంబంధించిన కథ కోసం ఆయన నిర్వాసిత కాలనీలో పర్యటించి, వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అతి త్వరలోనే ఈప్రాంత పరిసరాలలో షూటింగ్ చేసే ఉద్దేశం ఉన్నట్లు కాలనీవాసులతో చర్చించారు. కాలనీ యూత్ అధ్యక్షుడు బద్దె ప్రేమ్ కుమార్, కమిటీ సభ్యులు చింతపల్లి వీరబ్రహ్మం, పెరుమళ్ల నరసింహరావు, మిరియాల పుల్లారావు ఉన్నారు.

రేపు షర్మిల ఏలూరు రాక

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి/ఏలూరు కార్పొరేషన్)



కల్యాణ మండపంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న పద్మశ్రీ, గురునాథం

ఏపీసీసీ చీఫ్ షర్మిల ఈనెల 25న ఏలూరు రానున్నారు. ఈ మేరకు ఆమె పర్యటన కార్యక్రమం ఖరారైంది. తొలిసారిగా పీసీసీ చీఫ్ హోదాలో వస్తున్న షర్మిలకు ఘన స్వాగతం పలకడంతోపాటు సాధ్యమైనంత మేర కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ సీనియర్లు రంగంలోకి దిగారు. కాకినాడలో సభ ముగించుకుని నేరుగా గురువారం సాయంత్రం ఐదు గంటలకు షర్మిల ఏలూరు చేరుకుంటారు. కండ్రికగూడెం సుఖీభవ కల్యాణ మండపంలో ఏర్పాట్లను మంగళవారం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, నరసాపురం పార్లమెంటరీ కో-ఆర్డినేటర్ జెట్టి గురునాధరావు, ఏలూరుజిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్, పశ్చిమగోదావరి జిల్లా అధ్య క్షుడు మార్నీడి బాబీ, దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డి.వి.ఆర్.కె.చౌదరి పరిశీలించారు. షర్మిలకు ఘన స్వాగతం పలికేందుకు అన్ని నియోజకవర్గాల నుంచి భారీగా కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు ఏలూరు రానున్నారు. ఏలూరు పాతబస్టాండ్ నుంచి భారీ స్వాగతంతో ఆమెను నగరంలోకి ఆహ్వానించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని జెట్టి గురునాధరావు వెల్లడించారు. షర్మిల సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ప్రభుత్వాల విధానాలతో సంక్షోభంలో ఆక్వారైతు



మాట్లాడుతున్న గొట్టుముక్కల

పాలకొల్లు, జనవరి 23: ఆక్వా రైతు సంక్షోభంపై ఈనెల 20న పాలకొల్లులో నిర్వహించిన 2కె ర్యాలీ, సభ విజయవంతమైందని జై భారత్ క్షీరారామ ఆక్వారైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు అన్నారు. స్థానిక సంఘ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ, పాలకొల్లు, నరసాపురం, ఆచంట, భీమవరం, ఉండి, మహదేవపట్నం, కృష్ణాజిల్లా బంటుమిల్లి, ఏలూరు జిల్లా కలిదిండి, తూర్పుగోదావరి జిల్లా మల్కిపురం, రామేశ్వరం నుంచి ఆక్వారైతులు వేలాదిగా పాల్గొని సంఘీభావం తెలిపారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో ఆక్వారైతు తీవ్ర సంక్షోభంలో పడ్డారన్నారు. సీడ్, హేచరీస్, ప్రోసెసింగ్ యూనిట్ల సమస్యలను పరిష్కరించాలని సభ ద్వారా తెలియజేయడం జరిగిందన్నారు. మార్చి 31నాటికి సమస్యలను పరిష్కరించాలని ఆల్టిమేటం జారీచేశామన్నారు. బోనం వెంకట నర్సయ్య, ఫణీంద్రుడు పాల్గొన్నారు.

స్పీడ్‌గన్‌తో వాహన వేగం తనిఖీ



వాహన వేగాన్ని స్పీడుగన్‌తో పరిశీలిస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, జనవరి 23 : పదహారవ నెంబర్ జాతీయ రహదారిపై అతి వేగంగా వెళ్తున్న వాహనాలను స్పీడ్ గన్‌తో పోలీసులు, రవాణాశాఖ అధికారులు తనిఖీ చేసి జరిమానాలు విధించారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు మంగళవారం వాహన నియంత్రణ చర్యలు చేపట్టారు. మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ బద్దు నాయక్, ఏలూరు రూరల్ ఎస్‌ఐ కె.రాజారెడ్డి తనిఖీలు చేపట్టి అతి వేగంగా వెళ్తున్న ఎనిమిది వాహనాలకు జరిమానా విధించారు.

మద్ది ఆంజనేయుడికి విశేష పూజలు



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం, జనవరి 23 : గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామిని మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజామునే అర్చకులు స్వామికి ప్రభాతసేవ, నిత్యార్చన, తమలపాకులతో అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయం చుట్టూ భక్తులు 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. వివిధ సేవల రూపంలో రూ.12,78,194 ఆదాయం వచ్చినట్టు ఈవో ఆకుల కొండలరావు చెప్పారు.

అలుపెరగని యోధుడు నేతాజీ


తాడేపల్లిగూడెంలో బోస్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈలి నాని

తణుకు, జనవరి 23: స్వాతంత్ర్య పోరాటంలో అలుపెరగని యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని వక్తలు కీర్తించారు. మంగళవారం సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో మారుతీ కళాశాలలో నేతాజీ జయంతి సందర్భంగా విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ నాగరాజు పాల్గొన్నారు.

భీమవరం అర్బన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతిని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో మంగళవారం నిర్వహించారు. ప్రజల్లో దేశ భక్తిని రగిలించిన మహనీయుడు సుభాష్ చంద్రబోస్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి లంక కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పీవీ సుందర రామరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, జనసేన నాయకులు ఉండవల్లి రమేష్ నాయుడు, దళిత నాయకుడు గంటా సుందర్‌కుమార్, సంఘసేవకులు చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

పాలకొల్లు టౌన్: జీవీఎస్‌వీఆర్‌ఎం మున్సిపల్ స్కూల్లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు నిర్వహించారు. హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ మాట్లాడుతూ నేతాజీ జయంతిని కేంద్ర ప్రభుత్వం శౌర్య దినోత్సవంగా ప్రకటించిందన్నారు. నేతాజీ జీవిత విశేషాలను ఆయన విద్యార్థులకు వివరించారు. నేతాజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. బిస్కెట్లు, చాక్లెట్స్‌ను పంపిణీ చేశారు.

తాడేపల్లిగూడెం రూరల్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని తాడేపల్లిగూడెంలోని హౌసింగ్ బోర్డు సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే ఈలి నాని, వైసీపీ నాయకుడు కొట్టు విశాల్, ద్వారకా తిరుమల దేవస్థానం పాలకమండలి సభ్యుడు తాతా శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

భీమవరం రూరల్, జనవరి 23 : మండలంలో 10కోట్ల 15 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనానికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. అనంతరం కొల్లాటి పెద్దిరాజు ఇంటి నుంచి కొల్లాటి లక్ష్మణస్వామి ఇంటి వరకు నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. దెయ్యాలతిప్పలో నిర్మించనున్న పలు సీసీ రోడ్ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని, గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లిబాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం మానవుని జీవనతత్వానికి మార్గదర్శకం


ఉమర్ ఆలీషాను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, జనవరి 23 : ఆధ్యాత్మికత, సాహిత్యం, సంగీతం మానవుని జీవన తత్వానికి మార్గదర్శకాలని పిఠాపురం శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. త్యాగరాజ భవనంలో మంగళవారం నిర్వహించిన పీఠాధిపతి కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా79వ వర్ధంతి సభకు ఆలీషా అధ్యక్షత వహించి మాట్లాడారు. నిత్య జీవితంలో అనేక ఒత్తిడులతో జీవన పయనాన్ని కొనసాగిస్తున్న మానవుడు ఆధ్యాత్మికత, సాహిత్యం, సంగీతం పట్ల జ్ఞానాన్ని పెంపొందించుకుని తన జీవన విధానంలో ఆచరిస్తే మానసిక వత్తిడి తగ్గి ప్రశాంత జీవనం పొందుతాడని తెలిపారు. ఉమర్ ఆలీషా సాహితీ సమితి ద్వారా అందిస్తున్న ఉమర్ ఆలీషా కవి పురస్కారానికి సాహితీవేత్త డాక్టర్ వాసిలి వసంతకుమార్‌ను ఎంపికచేయడం తనకెంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ప్రత్యేక ఆహ్వానితులు నవలా రచయిత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ సాహిత్యానికి కుల మతాలు లేవని, సమాజ హితాన్ని కోరేది సాహిత్యమని వెల్లడించిన విశిష్ట వ్యక్తి ఉమర్ ఆలీషా అని అన్నారు. అనంతరం అవార్డు గ్రహీతకు 50,116 రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని అందజేసి సత్కరించారు

అంగన్‌వాడీలకు ఆర్థిక సహాయం

మొగల్తూరు, జనవరి 23: మొగల్తూరు వడయార్ పేటకు చెందిన టీడీపీ నాయకుడు పొన్నపల్లి శివ తన 25వ వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీలకు రూ.25వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. 40 రోజులుగా వేతనాలులేక ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీల పరిస్థితిని అర్థం చేసుకుని ఈ సహాయం చేసినట్టు తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు, కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొమ్మిడి నాయకర్, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మీల సమక్షంలో అందించారు.



నివేదికలు పరిశీలిస్తున్న పీడీ రాజేశ్వరరావు

ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

వీరవాసరం, జనవరి 23: ఉపాధిహామీ పథకం కింద మండలంలో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహించారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి నెల వరకు చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందాలు ఇచ్చిన నివేదికలపై చర్చించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలకోటి గరువు, ఉత్తరపాలెం, నవుడూరు, గ్రామాలలో ఉపాధి కూలీలు పనిచేయకుండానే మస్తర్లువేయటాన్ని తనిఖీ బృందాలు గుర్తించి నివేదిక ఇచ్చారు. ఈ గ్రామాల క్షేత్ర స్థాయి సహాయకుల నుంచి రూ.23319 సొమ్ము రికవరీకి ఏపీడీ రాజేశ్వరరావు ఆదేశించారు. 2019 - 20 సంవత్సరంలో బిజిపాలెంలో ఇళ్ళ స్థలాల పూడికలో బలుసుగొయ్యిపాలెంలో అవకతవకలు చోటు చేసుకున్నాయని టీడీపీ నాయకుడు వీరవల్లి చంద్రశేఖర్ ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు చేపట్టలేదని పీడీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై విచారణకు ఆదేశాలు జారీచేశారు.

ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల

నరసాపురం, జనవరి 23: పట్టణంలోని ఓటర్ల ముసాయిదా తొలి జాబితాను మంగళవారం కమిషనర్ వెంకటేశ్వరావు విడుదల చేశారు. టౌన్‌ప్లానింగ్ అధికారితో కలిసి 31వార్డుల జాబితాను ప్రకటించి, ఒక కాపీని మునిసిపల్ నోటీస్‌బోర్డులో ఉంచారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో మొత్తం 41 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచామన్నారు. బూత్ లెవిల్ అధికారులు కేంద్రాల వద్ద ఉండి జాబితాపై ఏమైన పొరపాట్లు ఉంటే వాటిని పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

పాలకొల్లు, జనవరి 23: ప్రతీనెలా క్రమం తప్పకుండా దాతల సాయంతో హెచ్‌ఐవీ బాధిత పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్న పాలకొల్లు మానవతా సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే రామానాయుడు అన్నారు. కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్లో 30మంది హెచ్‌ఐవీ బాధిత పిల్లలకు దాత తాటిపాక వేదవిద్యాసంస్థల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ అత్తోట రవికుమార్ ఆర్థిక సాయంతో మంగళవారం పౌష్టికాహారాన్ని అందచేశారు. మానవత అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, కన్వీనర్ ముత్యాల రామారావు, కోశాధికారి మద్దాల వాసు పాల్గొన్నారు.

దళితవాడల్లో టీడీపీ-జనసేన ప్రచారం

యలమంచిలి, జనవరి 23: దళితవర్గాలపై సీఎం జగన్ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఊటాడ గ్రామ సర్పంచ్ బుడితి జయరాజు, టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పాలపర్తి మాధవరావు ఆరోపించారు. దళితుల సంక్షేమ పథకాల రద్దు, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు నిర్వీర్యంపై ఊటాడ, చింతదిబ్బ, కాంభోట్లపాలెం గ్రామాల్లోని దళితవాడల్లో టీడీపీ, జనసేన నాయకులు మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ జనసేన నాయకులు మాట్లాడుతూ దళితవాడలను అభివృద్ధికి దూరం చేసిన జగన్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో నెక్కంటి సత్యనారాయణ, వాసంశెట్టి కేశవరావు, కొండేటి నరేష్, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, విజయరత్నం, తమ్మినీడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




పాలకొల్లులో దివ్యాంగులకు ఎమ్మెల్యే నిమ్మల, అంగర నిత్యావసర సరుకుల పంపిణీ.. భీమవరంలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శివ.. పాలకోడేరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రామరాజు

లోకేశ్ జన్మదిన వేడుకలు

కేక్‌లు కట్ చేసిన టీడీపీ శ్రేణులు
అన్నదానాలు.. పండ్లు పంపిణీ

భీమవరం అర్బన్/నరసాపురం టౌన్/పెనుగొండ/పాలకోడేరు/పాలకొల్లు టౌన్/గణపవరం/ఉండి/మొగల్తూరు/వీరవాసరం/తణుకు/తాడేపల్లిగూడెం అర్బన్//, జనవరి 23 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినం పురస్కరించుకుని మంగళవారం భీమవరం పార్టీ కార్యాలయంలో టీడీపీ జనసేన నాయకులు కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా పట్టణ టీడీపీ, జనసేన అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యం రాజు, చనమల్ల చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శులు కోళ్ళ నాగేశ్వరరావు, వేండ్ర శ్రీనివాస్, జనసేన నాయకులు బండారు శ్రావణి, టీడీపీ నాయకులు మెరగాని నారాయణమ్మ, మాదాసు కనకదుర్గ, సయ్యద్ నసీమా బేగం, ఎండీ షబీనా పాల్గొన్నారు. నరసాపురంలో ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పొన్నమండ నాగేశ్వరరావు, పాలూరి బాబ్జీ, జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, కొప్పాడ రవి, వాతాడి ఉమా, పి నాగబాబు పాల్గొన్నారు. రాయపేట కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు కేక్ కట్ చేశారు. వనితక్లబ్, టీడీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ రాజ్యలక్ష్మి కేక్ కట్ చేశారు. పెనుగొండలో మాజీ మంత్రి పితాని తనయుడు పితాని వెంకట్ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా శ్యామలా సోని, కటికిరెడ్డి నానాజీ, వేండ్ర రాము, రొక్కాల సురేష్, మండా ప్రసాద్, మద్దింశెట్టి వెంకటేష్, కట్టా గణేష్, రామోజీ కృష్ణ కిషోర్, పప్పొప్పుల బుజ్జి పాల్గొన్నారు. పాలకోడేరులో టీడీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే రామరాజు కేక్ కట్ చేసి లోకేశ్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. పాలకొల్లులో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో మంగళవారం నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. 50మందికి పైగా దివ్యాంగులకు 25 కేజీలు బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పట్లను ఎమ్మెల్యే రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ పంపిణీ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పోడూరు, యలమంచిలి మండల టీడీపీ అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, మామిడిశెట్టి పెద్దిరాజు, నాయకులు బోనం నాని, పాలవలస తులసీరావు, కొండేటి నరేష్ తదితరులు పాల్గొన్నారు. పిప్పరలో టీడీపీ మండల అధ్యక్షులు ఇందుకూరి రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఉండి టీడీపీ కార్యాలయం వద్ద లోకేశ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కేక్‌ను కట్ చేశారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాగిత బుజ్జి అధ్యతన కార్యక్రమం నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌చార్జి పేరిచర్ల బాలరాజు, ముదునూరి కృష్ణంరాజు, మాజీ జడ్పీటీసీ కాగిత మహంకాళి, కిన్నెర వెంకన్న పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు భీమవరంలోని తన కార్యాలయంలో లోకేశ్ జన్మదినం పురస్కరించుకుని కేక్‌ను కట్‌చేశారు. మొగల్తూరులో మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, పట్టణ అధ్యక్షుడు బస్వాని ఏడుకొండలు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రామరాజు, కొవ్వలి నాయుడు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మీ, కార్యకర్తలు పాల్గొన్నారు. వీరవాసరం మండలం కొణితివాడలో టీడీపీ జనసేన సంయుక్తంగా లోకేశ్ జన్మదిన వేడక నిర్వహించాయి. కేక్‌ను కోసి వేడుక చేశారు. కేక్‌ను జడ్పీటీసీ గుండా జయప్రకాష్ నాయుడు చే కోయించారు. కార్యక్రమంలో మండలశాఖ ఉపాధ్యక్షుడు యరకరాజు గోపాలకృష్ణంరాజు, వీరవల్లి శ్రీనివాసరావు, వీరవల్లి చంద్రశేఖర్, కడలి వాసు , పితాని కోటేశ్వరరావు జనసే మండలశాఖ అధ్యక్షుడు జవ్వాది బాలాజీ , అడ్డాల శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు. తణుకులో మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం అన్న క్యాంటీన్ వద్ద 400 మందికి అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, బసవా రామకృష్ణ, కలగర వెంకటకృష్ణ, గోపిశెట్టి రామకృష్ణ, పితాని మోహన్, గుబ్బల శ్రీనివాసు, ఆనాల ఆదినారాయణ పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం అన్న క్యాంటీన్ సమీపంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం బాబ్జి సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. తొలుత ఆలయాల్లో పూజల అనంతరం కేకు కట్ చేశారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.



తాడేపల్లిగూడెంలో వలవల బాబ్జి ఆధ్వర్యంలో బీసీ నాయకుల సమావేశం... తణుకులో ఆరిమిల్లి నాయకత్వంలో ఐక్యత చాటుతున్న బీసీ నాయకులు

'బీసీలను పల్లకీ ఎక్కించిన ఘనత టీడీపీదే'

పెంటపాడు, జనవరి 23: బీసీలను పల్లకి ఎక్కించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌రావు అన్నారు. మంగళవారం పెంటపాడులో టీడీపీ నాయకులు కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, బండారు వెంకట్రావు ఆధ్వర్యంలో మండల స్థాయి జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్, జ్యోతిరావుఫూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ చంద్రబాబు 34 శాతం మంది బీసీలకు పదవులిస్తే సీఎం జగన్ దానిని 10 శాతానికి దిగజార్చాడన్నారు. ఈ సందర్భంగా పెంటపాడు, జట్లపాలెం గ్రామాల నుంచి సుమారు 50 మందికి పైగా అంగర, వలవల బాబ్జి సమక్షంలో టీడీపీలో చేరారు. అనంతరం లోకేశ్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిశీలకులు నక్కా చిట్టిబాబు, గొర్రెల శ్రీధర్, జీ.నాయుడు, వేండ్ర శ్రీనివాస అన్నవరం, పోతుల అన్నవరం, గంధం సతీష్, దాసరి అప్పన్న, బండారు వెంకట్రావు, నల్లమిల్లి చినగోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తణుకు: బీసీలకు గౌరవం పెంచే పార్టీ టీడీపీ అని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం తణుకులో పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్ అధ్యక్షతన పట్టణ బీసీ నాయకులతో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ బీసీలకు పెద్దపీట వేసింది ఎన్టీరామారావు అన్నారు. సుమారు 100 మంది టీడీపీ బీసీ నాయకులపై దాడులు, హత్యలు జరిగాయన్నారు. 56 ఉత్తుత్తి కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి ఒక్క రూపాయి విదల్చలేదన్నారు. గుబ్బల శ్రీనివాసు, నియోజకవర్గ పరిశీలకుడు శ్యామ్ సుందర్, గౌరీ నాయుడు, వేండ్ర శ్రీనివాసు, కలగర వెంకటకృష్ణ, మట్టా వెంకట్, ఒమ్మి రాంబాబు, తమరాపు రమణమ్మ, తణుకు రేవతి పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

పాలకోడేరు, జనవరి 23 : తెలుగుదేశం ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం నెరవేరుతాయని ఎమ్మెల్యే మంతెన రామరాజు అన్నారు. విస్సాకోడేరులో ఇంటింటికి తెలుగుదేశం, మన రాంబాబు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా స్పందన చూస్తుంటే వైసీపీ ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉన్నదో అర్థమవుతుందన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, ఉండి నియోజకవర్గ బీసీ టీడీపీ నాయకుడు కామన రాంబాబు, కమ్మిలి రాంబాబు, నడిపూడి అప్పారావు, ఆరేపల్లి నాగరాజు పాల్గొన్నారు. విస్సాకోడేరు గ్రామంలో దాళ్వా పంట సాగు చేసుకునేందుకు సాగునీరు కొరత ఏర్పడిందని ఎమ్మెల్యే రామరాజుకు గ్రామ రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి సాగునీరు అందేవిధంగా చర్యలు చేపడతామని తెలిపారు.

వీరవాసరం: మత్స్యపురి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యతు గ్యారంటీ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, అమ్మఒడి, నిరుద్యోగ భృతి తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతా కనకయ్య, పిప్పళ్ళ నాగేశ్వరరావు, మురాల ఏసురత్నం, ముక్కు సుబ్బరాజు, వినుకొండ ఏసు పాల్గొన్నారు.

'టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యం'


సమన్వయ కమిటీ చర్చిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

నరసాపురం టౌన్, జనవరి 23: రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని పరిగణలోకి తీసుకుని టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా రెండు పార్టీలు కలిసి పని చేద్దామని మంగళవారం జరిగిన టీడీపీ, జనసేన సమన్వయ కమిటీ నిర్ణయించింది. జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, సీనియర్ నాయకులు కొవ్వలి నాయుడు, జనసేన కన్వీనర్ బొమ్మిడి నాయకర్‌లు మొగల్తూరు, నరసాపురం , పట్టణానికి చెందిన ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. మరికొన్ని రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్నందున్న బుధవారం నుంచి రెండు పార్టీలు కలిసి పని చేయాలని నిర్ణయించారు. టిక్కెట్ ఎవరికిచ్చినా... గెలుపు కోసం పని చేద్దామని నిర్ణయించారు.

పెండింగ్ రీ సర్వే పనులు పూర్తి చేయాలి

భీమవరం, జనవరి 23: పెండింగ్‌లో ఉన్న రీసర్వే పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జేసీ ఎస్.రామ్ సుందర్ రెడ్డి కోరారు. జిల్లా కలెక్టరేట్ నుంచి మంగళవారం రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ దశల్లో ఉన్న రీ సర్వేకు సంబంధించిన పది ఫార్మేట్ వివరాలను జేసీ అడిగి తెలుసుకున్నారు.

రసాయన కర్మాగారంలో మాక్ డ్రిల్

ఇరగవరం, జనవరి 23 : రసాయన కర్మాగారంలో కార్మికులంతా అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా పరిశ్రమల ఉపముఖ్య తనిఖీ అధికారి ఆర్. త్రినాథరావు తెలిపారు. కె. ఇల్లిందలపర్రులోని వాన్‌బెరి రసాయన కర్మాగారంలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. కమాండర్ ముఖేష్ కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి ఎం శ్రీనివాసరావు, లైజనింగ్ అధికారి చుంచుల వెంకటేశ్వరరావు, తహసీల్దార్ బి. మాలతి, రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి సంజయ్, తణుకు అగ్నిమాపక అధికారి అజయ్‌కుమార్, సర్పంచ్ నాగమణి పాల్గొన్నారు.

కార్డుదారులను ఇబ్బంది పెట్టవద్దు

ఆకివీడు, జనవరి 23: చౌకడిపోల్లో సమస్యలుంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురాకుండా కార్డుదారులను ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎన్వీ విజయలక్ష్మి, ఏఎస్‌వో రవిశంకర్ హెచ్చరించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో రేషన్ డీలర్లు, ఎండీయూలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రేషన్ డీలర్లు, ఎండీయూలు కలిసికట్టుగా పనిచేస్తూ కార్డుదారులకు సకాలంలో సరుకులు అందచేయాలన్నారు. పౌరసరఫరాల అధికారి మహేష్ పాల్గొన్నారు.

విధుల్లోకి అంగన్‌వాడీలు


ఆకివీడు ఐసీడీఎస్ కార్యాలయంలో సమావేశమైన అంగన్వాడీలు

ఆకివీడు, జనవరి 23: సమస్యలు పరిష్కారం కోసం తాము చేసిన 42 రోజులు సమ్మె పోరాటం ఫలించిందని అంగన్వాడీల జిల్లా ఉపాధ్యక్షురాలు మార్తమ్మ అన్నారు. ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించడంతో మంగళవారం విధుల్లో జాయినయ్యేందుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి అంగన్వాడీలు వచ్చారు.

పెనుమంట్ర: పెనుమంట్ర సెక్టార్ పరిధిలోని పెనుమంట్ర పెనుగొండ ఆచంట అంగన్వాడి సిబ్బంది విధుల్లో చేరేందుకు సెక్టారు కార్యాలయానికి రావటంతో కార్యాలయం వద్ద కోలాహలంగా మారింది.

ఉత్తమ ఫలితాలకు కృషి చేయాలి


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో రమణ

భీమవరం రూరల్, జనవరి 23: విద్యార్థుల సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేయడం, వెనకబడిన వారికి అనుసరించవలిసిన ప్రణాళికలను తయారు చేసుకోవడం, వాటిని అమలు పర్చడం ద్వారా మంచి ఫలితాలు సాధిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ అన్నారు. భీమవరం పీఎస్‌ఎం బాలికోన్నత పాఠశాలలో డీఈవో ఆర్‌వీ రమణ, ఉపాధ్యాయులకు మంగళవారం నాడు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలకు ఉపాధ్యాయులందరు కృషి చేయాలని అన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తమ్మయ్య

ఆచంట, జనవరి 23: రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య మంగళవారం తూర్పుపాలెంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాధరాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

గీత వృత్తి రక్షణకు ఐక్య పోరాటం

తణుకు, జనవరి 23: గీత వృత్తిని రక్షించుకునేందుకు ప్రభుత్వంపై ఐక్యంగా పోరాడదామని చేతి వృత్తిదారుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో గీత కార్మిక సమస్యలు-పరిష్కార మార్గాలు అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జగన్ సీఎం అయ్యాక కులాల పేరుతో కార్పొరేషన్‌లు పెట్టి నిధులివ్వకుండా నిర్వీర్యం చేశారన్నారు. సంఘ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, కామన మునిస్వామి, పీవీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

పోడూరు, జనవరి 23: మండలంలోని గుమ్మలూరు శివారు రావిగొప్పులోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణం నిర్వహించారు. భక్తులు స్వామివారిని అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణ దాత పెన్మెత్స వెంకట నరసింహరాజు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తోలేరులో అమ్మవార్ల జాతర



వీరవాసరం, జనవరి 23: తోలేరు గ్రామ దేవతలు పోలేరమ్మ, దండు గంగాలమ్మ జాతర మంగళవారం ప్రారంభమైంది. వారం రోజులపాటు నిర్వహించే అమ్మవార్ల జాతరకు సంబంధించి అమ్మవార్లకు కుంభములు వేశారు. బుధవారం అమ్మవార్ల జాతరను వైభవంగా నిర్వహించటానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలేరమ్మ అమ్మవారికి పసుపులేటి కృష్ణారావు కుటుంబ సభ్యులు దండు గంగాలమ్మ అమ్మవారికి గొర్రె శేషారావు కుటుంబ సభ్యులు వడి కట్టు కడతారు. జాతర ముగింపు సందర్భంగా ఆదివారం అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

ఇళ్ల నిర్మాణాలు పరిశీలన

పోడూరు, జనవరి 23: పండితవిల్లూరు జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను మంగళవారం ఎమ్మెల్యే శ్రీరంగనాధరాజు పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న ఇంటి సామగ్రి, బిల్లులు చెల్లింపులపై ఆయన లబ్ధిదారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి గృహప్రవేశాలు చేయాలని సూచించారు. సర్పంచ్ ఇళ్ల లక్ష్మీచంద్రిక, సొసైటీ చైర్మన్ గెద్దాడ ఏకలవ్య, హౌసింగ్ ఏఈ వెంకట్రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ బుజ్జేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నదానం

పాలకొల్లు టౌన్, జనవరి 23: అన్నా క్యాంటీన్‌లో దాత అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏనుగుపల్లి గ్రామానికి చెందిన దాత నిమ్మకాయల శేషనాయుడు ఆర్థిక సాయంతో మంగళవారం భోజనాలు ఏర్పాటు చేశారు. దాత నిమ్మకాయల శేషనాయుడును అభినందిస్తూ ఎమ్మెల్యే రామానాయుడు శాలువా కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ జడ్పీచైర్మన్ నామన రాంబాబు డొక్కా సీతమ్మ కుటుంబీకుడు డొక్కా నాగబాబు పాల్గొన్నారు.

వైభవంగా ఆదిలక్ష్మి అమ్మవారి గ్రామోత్సవం



భీమవరం టౌన్, జనవరి 23 : గునుపూడి గ్రామ దేవత శ్రీ ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి పోలేరమ్మ అమ్మవారి 33వ మహా జాతర సందర్భంగా మంగళవారం సాయంత్రం ఆదిలక్ష్మి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. ముందుగా బొక్కవారిపాలెం పొలిమేర దేవతకు ధూప దీప నైవేద్యాలతో అత్యధిక సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. కోపరేటివ్ మార్కెట్ సొసైటీ చైర్మన్ వెండ్రా వెంకటస్వామి చేతుల మీదుగా అమ్మవారికి పూజా కార్యక్రమాలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు.

మావుళ్ళమ్మకు రఘురాం పూజలు

భీమవరం టౌన్, జనవరి 23 : మావుళ్ళమ్మ అమ్మవారిని మంగళవారం నాడు బీజేపీ జాతీయ నాయకుడు పరిఘళ్ళ రఘురాం దర్శించుకుని పూజలు చేయించుకున్నారు. అమ్మవారిని దర్శించుకోగా ఆలయ అర్చకులు పూజలు చేసి ఆశీర్వచనాలుఅందించారు.

మార్టేరులో వైభవంగా దీపోత్సవం

పెనుమంట్ర, జనవరి 23 : మార్టేరు గ్రామంలో జెడ్ వంతెన దగ్గర శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో అయోధ్యలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా రెండు వేల దీపాలతో దీపోత్సవం జరిగింది. అనంతరం శ్రీరాముడు సీతమ్మ దంపతులకు ఉయ్యాల సేవ జరిగింది. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

తణుకు, జనవరి 23: తణుకు డివిజన్ పరిధిలోని డివిజినల్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఈ నెల 24న వినియోగదారులు ఫోరం చైర్మన్ బి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు తాడేపల్లిగూడెం ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక, ఆర్థిక సంబంధ, విద్యుత్ సమస్యలు తెలపాలన్నారు.

ఉచిత వైద్య సేవలు

తణుకు, జనవరి 23: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోషియేషన్, జనరిక్ మందులు షాపు ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు మంగళవారం సంఘ కార్యాలయంలో నిర్వహించారు. డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు అందించారు. సంఘ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, ఇవటూరి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే అజెండా: బొలిశెట్టి


బొలిశెట్టికి హారతులిస్తున్న మహిళలు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 23: ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా పనిచేస్తానని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. కుంచనపల్లిలో మంగళవారం నిర్వహించిన పల్లెపోరులో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగన్ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్య మయ్యాయని, తాము అధికారంలోకి రాగానే అన్ని వర్గాలకు న్యాయం చేస్తామన్నారు. ఎస్సీ కాలనీలో యువత జనసేనలో చేరారు. నాయకులు అడపా ప్రసాద్, శంకరం, మైలవరపు రాజేంద్ర ప్రసాద్, మద్దాల మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

ఆచంట, జనవరి 23: వల్లూరు పంచాయతీ వద్ద రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ జయలలిత ఆధ్వర్యంలో ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఓటర్లు పాల్గొని ఈవీఎంలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, పంచాయతీ కార్యదర్శి జీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

పెనుగొండ: వడలి గ్రామంలో డీఆర్‌వో ఎస్వీవీ రాజేశ్వరరావు ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురుమూర్తి రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అయోధ్యలంకలో వికసిత సంకల్ప యాత్ర

ఆచంట, జనవరి 23: వికసిత భారత్ సంకల్ప యాత్రను మంగళవారం అయోధ్యలంకలో సర్పంచ్ కడలి కృష్ణ వేణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పలు సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు ఎం. నాగ సుబ్బారావు, ఈవోపీఆర్‌డీ మూర్తి బాబు, పొదల సుమన్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సర్దుబాటుపై సమీక్ష

భీమవరం, జనవరి 23 : గ్రామ, వార్డు సచివాలయాల్లో పని సర్దుబాటుకు సచివాలయ ఉద్యోగుల వివరాలను సంబంధిత శాఖాధిపతులు వెంటనే సమర్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు కలెక్టరేట్‌లో మంగళవారం తన ఛాంబర్‌లో సచివాలయ ఉద్యోగుల శాఖాధిపతులతో కలెక్టరు సమావేశమై, సచివాలయ ఉద్యోగులను రేషనలైజేషన్ ప్రక్రియలో సర్దుబాటుపై సమీక్షించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సిబ్బంది కొరత ఉన్న సచివాలయాలకు ఇతర సచివాలయాల నుంచి సిబ్బందిని సర్దుబాటుకు నియమించాలన్నారు. సిబ్బందిని ఆ మండలానికి దగ్గరలో వున్న మండలంలో నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పోలింగ్ కేంద్రాల నమూనాలు పరిశీలన

భీమవరం టౌన్, జనవరి 23: ఆర్డీవో కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి మంగళవారం సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, కంట్రోల్ రూమ్‌ల నమూనాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు, ఎక్కడ ఎటు వంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను ఆదేశించారు.

పొదుపు సంఘాలకు ఆసరా సొమ్ము జమ

భీమవరం టౌన్, జనవరి 23 : జిల్లాలో 27వేల04 స్వయం సహాయక సంఘాలలో 2,67,441 మంది పొదుపు సంఘం సభ్యులను రుణ విముక్తికి ఆసరా ద్వారా వరుసగా నాల్గవ విడత రూ.275.90 కోట్ల నగదు ముఖ్యమంత్రి మంగళవారం జమ చేశారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో వివిధ డ్వాక్రా సంఘాల ప్రతి నిధులు, తదితరులు పాల్గొన్నారు.